
మినీకథ




డాబామీదనే పడుకున్న నాంచారయ్యకు ఒక రాత్రివేళ ఎందుకో మెలకువ వచ్చింది. మెల్లగా లేచి కూర్చుని కళ్ళు నలుముకున్నాడు.

నాంచారయ్యగారిది, అవతారంగారిది ప్రక్క ప్రక్కనే వున్న డాబాలు. కాలం కలిసివచ్చి అవతారం గారు తన డాబా పై గదులు వేసుకుంటున్నారు. గోడలు నిలబడ్డాయి. ద్వారబంధాలు నిలబడ్డాయి. ఇక స్లాబు మాత్రమే మిగిలి వుంది. గత పదిహేను రోజులుగా పనివాళ్ళు పనులు చేస్తున్నారు.

'సమయం ఎంతయిందో?' మనసులోనే ప్రశ్న ఉదయించింది. 'ఏ ఒంటి గంటో అయి వుంటుంది' సమాధానం కూడా మనసులోనే చెప్పుకున్నాడాయన. ఇంతలో ఎదురుగా అవతారంగారి డాబామీద...

'ఎవరో కూర్చుని చుట్ట తాగుతున్నట్లుందే! ఇంత రాత్రివేళ ఎవరయి వుంటారు చెప్మా!'

కళ్ళు చిట్లించి మరీ చూచాడు నాంచారయ్య. సందేహం లేదు. ఎవరో కూర్చుని చుట్ట తాగుతున్నారు! తనకు తెలిసి అవతారంగారికి చుట్ట అలవాటు లేదు. పోనీ సిగరెట్లు కాల్చే కొడుకులు ఎవరయినా వున్నారా? అంటే ఆయనకు అసలు కొడుకులే లేరు. మరి ఇంత రాత్రివేళ తాపీగా కూర్చుని కాల్చేవారు ఎవరయి వుంటారబ్బా!

మరోసారి కళ్ళు చిట్లించి చూచాడు నాంచారయ్య! ఎవరయినదీ గుర్తుపడదాం అనే వుద్దేశ్యంతో. 'కొంపదీసి ఏ దొంగో కాదుగదా...! ఒకింత భయం. ఇక లాభం లేదు. కేకపెట్టి పిలుద్దామనుకున్నాడు.

'ఎ... ఎవరదీ!'

... సమాధానం లేదు. రెండుసార్లు పిలిచినా అటు నుండి సమాధానం రాకపోయేసరికి 'కొంపదీసి ఏ కొరివి దయ్యమో కాదుగదా!' అనే అనుమానం వచ్చేసరికి కాళ్ళలో నుండి సన్నగా ఒణుకు ప్రారంభమయింది. ఒక ఆలోచన వచ్చి 'అవతారంగారూ! అవతారంగారూ!' వెంటవెంటనే అరిచాడు నాంచారయ్య.

అవతారం గారింట్లో దీపాలు వెలిగాయి.

'ఏవండీ! ఏమండీ! మిమ్మల్నేనండీ! మన ప్రక్కాయన నాంచారయ్యగారు పిలుస్తున్నారు లేవండీ!' అని భార్య లేపగా వళ్ళు విరుచుకుని విద్రాభంగం అయిందన్న కోపంతో 'ఏమిటే! ఏమిటీ గొడవ!' అని భార్య మీద విరుచుకుపడ్డాడు. భార్య సంగతి చెప్పగానే ఒక్కవుదుటున లేచి బయటికి వచ్చి, పైకి నాంచారయ్యగారి డాబామీదకు చూస్తూ 'ఏమిటండీ? నాంచారయ్యగారూ ఇంత రాత్రివేళ?' సందేహం వెలిబుచ్చాడు.

'ఏమిటీ అని మెల్లగా అడుగుతారేమిటండీ? మీ డాబామీద ఎవరో కూర్చుని చుట్ట కాలుస్తున్నాడండీ! తాపీగా కాల్చుకున్న తరువాత ఇంట్లో జొరబడదామనుకున్నాడో ఏమో తెలియదు. పిలిస్తే పలకడం లేదు. మీరు ఒకసారి పైకి వచ్చి చూడండి. టార్చిలైటు తీసుకురండి.'

'ఆ! అలాగా! ఇపుడే వస్తున్నా! ఏమే! ఆ టార్చి ఇలా తీసుకురా!'

మరో నిమిషంలో టార్చి తీసుకుని బయలుదేరాడు అవతారం. 'ఏమండీ! నాకేదో భయంగా వుందండి. మీరు వెళ్ళవద్దండి. ఎవరినైనా పంపిద్దామండీ' భార్య అర్థింపు.

'పిచ్చిదానా ఏమీ భయంలేదు లేవే! ఇపుడే వస్తానుగా! ఏమీ కంగారుపడకు.' అంటూ టార్చి కాంతిలో మెల్లగా మెట్లు ఎక్కుతూ 'ఎవరూ? ఎవరయ్యా అదీ! ఆ! ఎవరంటే మాట్లాడరే?' గర్జించాడు అవతారం.

చుట్ట నుసి దులుపుతున్నట్లు కనిపించింది అవతారం గారికి.

'అమ్మో! నిజమే! ఎవడో దర్జాగా కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు. లాభంలేదు! ఎవడో దొంగవెధవే అయి వుంటాడు. నా కొంప దోచేద్దామనుకున్నాడో ఏమిటో!'

ఎవరయ్యా నువ్వు? ఇందాకటి నుంచి అరుస్తుంటే మాట్లాడవే! అంటూ ఆఖరి మెట్టుకూడా ఎక్కి భయం భయంగా ముందుకు కదలి టార్చి ఫోకస్ చేసి చూచాడు అవతారం.

అంతే!

అవతారంగారికి భయంపోయి నవ్వు వచ్చింది. రావడమేమిటి గట్టిగా నవ్వేశాడు కూడా!

'నాంచారయ్యగారూ! మీరు కంగారుపడ్డారు. మమ్మల్ని కూడా కంగారు పెట్టేశారు. దొంగాకాదు. దెయ్యమూ కాదు. మా పనివాళ్ళు చుట్టలు కాల్చుకోవడానికి తాడు అంటించి ఈ ద్వారబంధానికి కట్టారు. చీకట్లో మనిషి కనబడకపోయినా నిప్పు కనబడి మనలనందరిని కంగారు పెట్టింది!' అన్నాడు నవ్వుతూనే.

'ఆరినీ!' అనుకుంటూ బట్టతల తడుముకుంటూ మంచంమీదకు చేరుకున్నాడు నాంచారయ్య. ●

కాలప్ఏ దాటని కథ

## బెజవాడ: తిరుపతి

నేను గడపలో అడుగుపెట్టేసరికి అంకుల్ని ఆయన అడుగుతున్నాడు. "ఏం గురూగారూ, మీ ఇంట్లో బెజవాడా, తిరుపతా?" అని.

నాకేం అర్థం కాలేదు. ఆయన వెళ్ళి పోయింతర్వాత అంకుల్ని అడిగాను, "బెజవాడా, తిరుపతేమిటంకుల్? ఎల్ టీ సీలో ఈ సంవత్సరం మీరూ, ఆంటీ యాత్రలకెళ్తున్నారా అక్కడికి?" తన బుర్రమీసా లెగిరిపడే ట్టుగా ఆయన పెడీపెడీ నవ్వి, "బీ కాం చదువు తున్నావ్, ఆ మాత్రం అర్థం కాలేదూ? బెజవాడంటే బెజవాడ కనకదుర్గమ్మ! తిరుపతంటే తిరుపతి వెంకన్న! మీ ఇంట్లో ఎవరి డామినేషనూ? అని మా ఫ్రెండు అడిగినదాని అంతరార్థం?"

లోపల్నుంచి వంట గరిటెతో హాల్లోకి వచ్చిన ఆంటీ అడిగింది, "మీరేమన్నారేవిటి?" "ఏమంటామూ? బెజవాడ కనకదుర్గే పవర్‌ఫుల్ అన్నాను." అంకుల్ గొంతు



సవరించుకున్నాడు. నేను మా ఫ్రెండుతో ఈ మాట చెప్పాను. "రీసర్చి చేద్దామేవిటి- మనకు తెలిసిన ఇళ్ళల్లో?" మా ఫ్రెండు సజెస్టు చేసింది ఆసక్తిగా. మేం ఇద్దరం మా తెలుగు లెక్చరరు గురించి భోగట్టా సేకరించాం. పొద్దున్నే ఆయనే ముందుగా నిద్దర్లేచి భార్యకు గుడ్‌మార్నింగ్ చెబుతూ కాఫీ ఇస్తాడని తెలిసింది. తన భార్య చీరల్ని ఆయనే ఇస్త్రీ చేసి పెట్తాట్ట! ఆవిడ ఏ పేరంటానికో వెళితే, ఇద్దరి పిల్లల్నీ ఎడం చంకనా, కుడిచంకనా ఎత్తుకుని ఆడిస్తూ బయట నిలబడి వుంటాట్ట. కామర్స్ లెక్చరరు గారైతే వచ్చిన జీతమంతా భార్య ఎకౌంటులో బ్యాంకులో జమ చేస్తాట్ట. మా ఇంగ్లీషు మాష్టారికైతే, కాలేజీకి వచ్చేటప్పుడు లెక్కపెట్టి, రిక్షాకింత, మధ్యాహ్నం టిఫిన్‌కింత అని వాళ్ళావిడ ఇస్తుందట! చేసిన రీసెర్చితో అలసిపోయి ఇంటికొచ్చేసరికి మా నాన్న అగ్గిమీద గుగ్గిలమై పోయి, "ఎక్కడికి పోయినావే పొద్దుట్నించీ-" అంటూ కోప్పట్టం మొదలెట్టారు. లోపల్నుంచి మా అమ్మ అన్నది, "ఆడపిల్లమీద అథార్టీ ఎందుగ్గానీ, ఇట్రండి కాస్త కాఫీ తీసుకుపోయి ఇద్దురుగాని!" మా నాన్న కుక్కిన పేన్లా లోపలకు నడిచాడు. అర్థమైందా మా ఇంట్లో బెజవాడ!

—కొండముది రుక్మిణీదేవి